క్లుప్తంగా

ప్రమాదానికి గురైన కారుకు నిప్పు



దగ్ధమవుతున్న కారు

కొడవలూరు: రోడ్డు ప్రమాదానికి గురైన కారుకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గత శుక్రవారం ఎర్టిగా కారులో తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన వారు హైదరాబాద్ నుంచి వస్తూ కొడవలూరు మండలం రాచర్లపాడు వద్ద చెట్టుకు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఓ బాలిక, వృద్ధుడు మృతిచెందారు. అప్పట్నుంచి ప్రమాదానికి గురైన కారు ఘటనా స్థలంలోనే ఉండిపోయింది. ఈ కారుకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం నిప్పంటించారు. దీంతో కారు పూర్తిగా కాలిపోయింది.

రామతీర్థంలో భక్తుల సందడి




సముద్రతీరంలో భక్తుల కోలాహలం

విడవలూరు: మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం భక్తులు సముద్రస్నానానికి వేల సంఖ్యలో పోటెత్తారు. ఈ సందర్భంగా తీరంలో ఇసుకతో వివిధ రకాల శివలింగాలను తయారు చేసి వాటిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి తెప్ప మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించగా ఆలయ ఈఓ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ అత్తిరాల సురేష్ పర్యవేక్షించారు.

భూ ఆక్రమణలపై చర్యలకు వినతి

కోవూరు: విడవలూరు మండలం ఊటుకూరు పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు కనపర్తి నాగేంద్ర కోరారు. ఈ మేరకు విడవలూరు మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్లు 553-2ఏ, 559-3, 921-922-22, 932-1, 933-1లోని ప్రభుత్వ భూములు సుమారు 305 ఎకరాలను కొందరు ఆక్రమించుకుని, రొయ్యల సాగు చేస్తున్నారన్నారు. దీనివల్ల వరద నీటి ప్రవాహ మార్గాలు పూర్తిగా మూసుకుపోతున్నట్లు తెలిపారు.

గంగ కాలువ నుంచి నీరు వృథా



సైదాపురం: మండలంలోని పోతేగుంట సమీపంలోని తెలుగు గంగ బ్రాంచ్ కాలువ వద్ద నీరు వృథా అవుతోంది. దానికి గేట్ వాల్వు బిగించి వృథాను అరికట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. పోతేగుంట వద్ద ఉన్న కాలువ నుంచి తిప్పిరెడ్డిపల్లి, తోకలపూడి, కమ్మవారిపల్లి, లింగసముద్రం, అనంతమడుగు, రాగనరామాపురం గ్రామాల్లోని పొలాలకు నీరందుతుంది. సుమారు 750 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. నీరు వృథాగా పోతుండటంతో పొలాలకు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కూనారం సాగుకే సమాయత్తం

- కేఎస్ఎం 1638 పేరుతో వరి వంగడం
- 60 శాతం కూనారం నాట్లు పడే అవకాశం
- దిగుబడితో పాటు తెగుళ్లను తట్టుకునే వంగడం
- సాగు విస్తీర్ణం తగ్గుతున్న బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలు

రైతులు ప్రస్తుత ఎడగారు(ఖరీఫ్) సాగులో కూనారం వరి రకంపైనే ఆసక్తి చూపుతున్నారు. మూడేళ్ల క్రితం ఉమ్మడి నెల్లూరు జిల్లాకు పరిచయమైన తెలంగాణ కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానం కొనుగొన్న కేఎస్ఎం 1638 వరి వంగడాన్ని ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు.



పొదలకూరు మండలంలో వేసిన కేఎస్ఎం 1638 రకం వరినాట్లు

పొదలకూరు : సంప్రదాయంగా ఎప్పటి నుంచో సాగులో ఉన్న బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 34449 రకాల సాగు ప్రస్తుతం గణనీయంగా తగ్గుతోంది. గత రబీలో కేఎస్ఎం 1638 రకం వరివంగడాన్ని సాగు చేసిన రైతులకు దిగుబడి తగ్గిందని గగ్గోలు పెట్టారు. జడివానల వల్ల సూర్యరశ్మి సక్రమంగా లేకపోవడంతోనే కూనారం దిగుబడి తగ్గినట్టు శాస్త్రవేత్తలు తేల్చారు. దీంతో తిరిగి రైతులు ఎడగారులో కూనారం వంగడంపైనే ఆసక్తి చూపారు. ప్రస్తుతం జిల్లాలో 60 శాతం కేఎస్ఎం 1638 రకం నాట్లు పడే అవకాశం ఉంది. జిల్లాలో ఎడగారులో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టనున్నట్టు ఐఏబీ సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లో అగ్రభాగం కూనారం వరి రకం సాగు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పడుతున్న నాట్లలో కూడా కేఎస్ఎం రకమే అధికంగా ఉంది.

తగ్గిన ఎన్ఎల్ఆర్ 34449

ఐదేళ్ల క్రితం వరకు ఎన్ఎల్ఆర్ 34449(నెల్లూరు మసూరా) జిల్లాలో తిరుగులేని వరి వంగడంగా వెలుగొందింది. అయితే కోతల విషయంలో ఇబ్బందులు, తెగుళ్లు, దిగుబడి తదితర కారణాల వల్ల ఎన్ఎల్ఆర్ రకాన్ని రైతులు క్రమంగా తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 20 శాతం సాగుకు కూడా ఎన్ఎల్ఆర్ నోచుకోవడం లేదు. బీపీటీ 5204 రకానికి గిట్టుబాటు ధరలు లభిస్తున్నా ఈ రకం వరి నాట్లు కూడా తగ్గిపోతున్నాయి.

ఎంటీయూ 1010కు పెరిగిన డిమాండ్

ఎంటీయూ 1010 రకం వరి వంగడానికి ఈ ప్రాంతంలో కొంత డిమాండ్ పెరిగింది. ఈ రకం ధాన్యం భోజనానికి పనికిరాకున్నా బొరుగుల తయారీకి పెట్టింది పేరు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పుడు 20 శాతం 1010 రకం నాట్లు పడుతున్నాయి. ఖరీఫ్‌లో ఎంటీయూ రకం దిగుబడి బాగుంటుంది. ఎకరానికి 4 పుట్లు ధాన్యం దిగుబడి అవుతుండడమే కాక పుట్టి రూ.18 వేల నుంచి రూ.19 వేల ధర పలుకుతున్నాయి. రబీలో ఎంటీయూ రకం సాగు చేయవద్దని ప్రభుత్వం వెల్లడించినా రైతులు కొందరు సాగు చేసి ఆదాయాన్ని పొందారు. చెన్నైకు చెందిన మిల్లర్లు అత్యధిక సంఖ్యలో ఎంటీయూ రకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కేఎస్ఎం 1630 కంటే ఎంటీయూ 1010 రకమే అదనంగా ధరలు పలికాయి. దీంతో రైతులు ఎంటీయూ సాగుపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. అయితే ఈ రకం అకాల వర్షం కురిస్తే కంకులు వాలిపోయి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది.

ఎందుకీ ఆసక్తి

ఆర్ఎన్ఆర్ 15048(తెలంగాణ మసూర)పై నాలుగేళ్లుగా మొగ్గుచూపిన రైతులు ప్రస్తుతం కేఎస్ఎం 1638 రకంపై ఆసక్తి కనపరుస్తున్నారు. ఈ వంగడాన్ని మూడేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామ శివారులో ఆచార్య జయశంకర్ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రూపొందించారు. కేఎస్ఎం దిగుబడి బాగా ఉండటమే కాక చీడపీడల ఖర్చు తక్కువగా ఉండటం వల్ల రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. సన్నరకం కావడమే కాక బీపీటీ కంటే నెలరోజుల ముందే కోతకు వస్తుంది. 120 రోజులకు దిగుబడినిస్తుంది. సాధారణంగా ఎడగారులో అన్నిరకాల వరి విత్తనాలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. అయితే కేఎస్ఎం 1638 ఎడగారులోనూ ఆశించిన స్థాయిలో దిగుబడిని ఇస్తుందని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. రబీలో ఎకరానికి 4 పుట్లు, ఎగడారులో 3 పుట్లు దిగుబడినిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకునే శక్తి కేఎస్ఎం 1638కు ఉండడం వల్ల రైతులు నార్లు పోసుకుంటున్నారు.

కేఎస్ఎం 1638పై ఆసక్తి పెరిగింది



రైతులకు కేఎస్ఎం 1638 రకం వరిసాగుపై ఆసక్తి పెరిగింది. సాగుకు అనుకూలమైన రకం వంగడాన్ని రైతుల ఇష్టపడతారు. కేఎస్ఎం దిగుబడి కూడా బాగుండడం వల్ల ఎడగారులో చాలా మంది రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలామంది కూనారం వరివంగడాన్ని వేస్తున్నారు.

– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

ఖరీఫ్‌లోనూ దిగుబడి బాగుంది



కేఎస్ఎం 1638 వరి రకం ఖరీఫ్‌లోనూ దిగుబడి బాగుంటుంది. కనుక రైతులు దిగుబడి, ధరలను దృష్టిలో ఉంచుకుని కేఎస్ఎం వెరైటీని సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎంటీయూ 1010 రకం ఎడగారులో కొంత విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నాం.

– కె.శివనాయక్, ఏడీఏ, పొదలకూరు

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోవూరు: మండలంలోని పడుగుపాడు పరిధిలో రైలు పట్టాలపై జనశతాబ్ది రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతుడు కోవూరు పట్టణానికి చెందిన హుస్సేన్ కాలేషా(41)గా గుర్తించారు. ఈ మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



మనుబోలు: రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు అధిక మోతాదులో వాడటం వల్ల చౌడు భూములుగా మారుతుందన్నారు. దీనిని నివారించేందుకు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. ఇందుకోసం జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో 10 కేజీల బస్తా రూ.612లకు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది, రైతులు ఉన్నారు.

భక్తులకు ప్రసాదాల వితరణ

విడవలూరు: మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులకు బీఎమ్మార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ దొడ్ల వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా అన్నప్రసాదం, మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఇందుకూరుపేటలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి వాణి

ఇందుకూరుపేట: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో మండలంలోని ఇందుకూరుపేటలో న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రాజ్యాంగ హక్కుల గురించి తెలియజేశారు. మహిళల అక్రమ రవాణా, పిల్లలతో భిక్షాటనపై గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోపి, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, ఏపీఎం సరిత, ఏఎస్సై భాస్కర్‌రాజు, పారా లీగల్ వలంటీర్ పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కళాశాల ఉద్యోగుల నిరసన



కళాశాల ఎదుట నిరసన చేస్తున్న ఉద్యోగులు

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరులోని మత్స్య కళాశాల ఉద్యోగులు, సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రీ-ఎంప్లాయిమెంట్‌లో నియమితుడైన ఉద్యోగి బుధవారం కళాశాల అసోసియేట్ డీన్‌పై దాడికి పాల్పడటాన్ని ఖండించారు. డీన్‌కు సరైన భద్రత లేకపోవడం తమకు సైతం ఆందోళన కలిగిస్తున్నట్టు తెలిపారు. దాడి జరిగితే విశ్వవిద్యాలయం నుంచి ఇప్పటి వరకు స్పందన లేదని, తమకు అనేక అనుమానాలకు తావిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ అధికారులు చొరవ తీసుకుని కళాశాల భద్రతపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

అన్నిరంగాల్లో వీఎస్‌యూ అభివృద్ధి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని వీసీ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సంస్థాపన దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో స్థాపించిన వీఎస్‌యూ విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. విద్య, పరిశోధన, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో నిరంతరం అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని వివరించారు. పూర్వపు వీసీలు, రిజిస్ట్రార్ల సేవలను ఎప్పటికీ మరువలేమని, వారు వేసిన బలమైన పునాది మీదే వీఎస్‌యూ నిలబడి ఉందని చెప్పారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్ మాట్లాడుతూ వీఎస్‌యూ అభివృద్ధికి నెల్లూరు నగరపాలక సంస్థ తరఫున అన్ని విధాలుగా మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సమాజానికి అవసరమైన నైతిక విలువలు బోధించే దిశగా వీఎస్‌యూ ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ విధానాలతో నాణ్యమైన ఆహారం



ఇందుకూరుపేట మండలంలో..

కోవూరు: రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా సేంద్రియ విధానాలవైపు మొగ్గు చూపాలని, దీని ద్వారా నాణ్యమైన ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయవచ్చని డీఏఓ సత్యవాణి తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం, గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ పచ్చిరొట్ట, కంపోస్ట్, వర్మి కంపోస్ట్ వంటివి నేల సారాన్ని పెంచుతాయన్నారు. పీఎండీఎస్ కిట్లను త్వరలో రైతులకు అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం వాయు కాలుష్యం పెరుగుతోందని, దాని నివారణకు రసాయన ఎరువులను తగ్గించాలన్నారు. అనంతరం కోవూరు వ్యవసాయ సంచాలకురాలు అనిత మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం వారు రైతులతో నేరుగా మాట్లాడి, సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ రజని, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ద్వారా ఎరువులు వాడాలి

విడవలూరు: భూసార పరీక్షల ఆధారంగా పంట పొలాల్లో ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మి సూచించారు. మండలంలోని పార్లపల్లి, చౌకచర్ల గ్రామాల్లో ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు మందులపై అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు తగిన మోతాదులో మందులను వినియోగించి అధిక దిగుబడులు పొందాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులందరూ సీసీఆర్ కార్డులు తీసుకోవాలని, తద్వారా పంటల నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు తమీనా, చెంచులక్ష్మి, స్థానిక రైతులు ఎ.జనార్దనరెడ్డి, టి.జనార్దన్‌రెడ్డి, కె.మురళిరెడ్డి, ఎస్.శ్రీనివాసులు, పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణ చర్యలు చేపట్టాలి

ఇందుకూరుపేట: రైతులు తప్పక కలుపు నివారణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లేబూరు, పున్నూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలుపు నివారణ చర్యలకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ యమున, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ముత్తుకూరు(పొదలకూరు) : ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులను వినియోగించాలని, దీనివల్ల భూమిలో నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రియ కర్బనం, జింక్‌లోపం తెలుస్తుందని ఆత్మ పీడీ శివన్నారాయణ తెలిపారు. మండలంలోని పిడతాపోలూరు గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పీడీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముత్తుకూరు ప్రాంతంలో గంధకం అధికంగా ఉండడం వల్ల నాటిన వరి చనిపోతున్నట్టు తెలిపారు. దీనివల్ల రైతులు గంధకం లేని రసాయన ఎరువులను వాడాల్సిందిగా సూచించారు. వరినాట్లకు ముందు పచ్చిరొట్ట ఎరువులను వేసుకుని దమ్ము చేసుకుంటే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి మాట్లాడుతూ జీవన ఎరువులు కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉందని, వీటిని పంటలకు వినియోగిస్తే రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణతో కలిసి అధికారులు పొలంలోకి వెళ్లి నానో డీఏపీ, నానో జింక్, నానో సల్ఫర్‌ను పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్, ఏఓ జోత్స్నరాణి, హెచ్ఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు: మాట్లాడుతున్న ఏఓ లక్ష్మి



కోవూరు: మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి



ముత్తుకూరు: పిడతాపోలూరులో మాట్లాడుతున్న ఆత్మ పీడీ

ఏఆర్డీ సేవలు ప్రశంసనీయం

కొడవలూరు: గిరిజనుల అభ్యున్నతికి ఏఆర్డీ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం పీఎస్సార్ ఫంక్షన్ హాల్లో ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన మహిళా మత్స్యకార సహకార సంఘాలతో బుధవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన మహిళలు సంఘాలుగా ఏర్పడడం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయన్నారు. నాబార్డు, సహకార బ్యాంక్‌లు రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గిరిజన మహిళలకు మత్స్యకార సహకార సంఘాల నమోదు పత్రాలను అందించి మాట్లాడారు. గిరిజనులు అన్నిరంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, నాబార్డు డీడీఎం బాబు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం, డీసీసీబీ జీఎం సరిత, ఏఆర్డీ కార్యదర్శి బషీర్, డీసీఓ గురప్ప, తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ వెంకట సుబ్బారావు, నాయకులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, కరకటి మల్లికార్జున, పాటూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

మనుబోలు: బుచ్చిరెడ్డిపాళెంలో జూలై 1న జరుగనున్న ఆటో కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల నాయకులు కోరారు. మండలంలోని కాగితాలపూరు, పిడూరు గ్రామాల్లో ఆటో కార్మికులు బుధవారం సమావేశమై మహాసభలపై చర్చించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఆదిశేషయ్య, దేవదానం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని సూచించారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

'ఎమర్జెన్సీ' పోరాట ఖైదీకి సన్మానం



సుబ్బారావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మనుబోలు: దేశంలో ఎమర్జెన్సీ విధించిన సందర్భంలో దానికి వ్యతిరేకంగా పోరాడి జైలుపాలైన ముప్పలశెట్టి సుబ్బారావును మనుబోలులోని ఆయన నివాసంలో బీజేపీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ బోలా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో ఎమర్జెన్సీ నాటి నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో చురుగ్గా పాల్గొని జైలుపాలైన సుబ్బారావు త్యాగనిరతిని కొనియాడారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ మరోసారి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే యువతరం చైతన్యవంతంతో మెలగాలని ఆకాంక్షించారు. వారి వెంట బీజేపీ నాయకులు పెనుమల్లి వెంకటకృష్ణారెడ్డి, వలిపి శ్రీనివాసులు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

బైక్ అదుపుతప్పి..



ప్రమాదంలో గాయపడిన సుబ్రహ్మణ్యం

మనుబోలు: బైక్ అదుపుతప్పి తండ్రి, కుమారుడికి గాయాలైన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం జరిగింది. చెర్లోపల్లి గ్రామానికి చెందిన బల్లి సుబ్రహ్మణ్యం తన కుమారుడు చిరంజీవితో కలిసి మోటార్‌సైకిల్‌పై గూడూరుకు వెళ్తున్నారు. వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని..



చికిత్స పొందుతున్న బ్రహ్మతేజ

విడవలూరు: రోడ్డు ప్రమాదంలో కంచరపాళెం గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఊటుకూరు పంచాయతీ కంచరపాళెం గ్రామానికి చెందిన ఉప్పాల బ్రహ్మతేజ అతని తమ్ముడు వెంకటకృష్ణతో కలిసి బుధవారం ఉదయం 2 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టేందుకు ఊటుకూరు గ్రామానికి వచ్చారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఊటుకూరు శివారు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ముగ్గురు వ్యక్తులు బైక్‌పై రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బ్రహ్మతేజకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి వెళ్లడంతో పక్కనే ఉన్న సోదరుడు వెంకటకృష్ణ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనపై వెంకటకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రక్కు, ఆటో ఢీకొని..



ప్రమాదానికి గురైన వినోద్

కోవూరు: మండల పరిధిలోని పెద్ద పడుగుపాడు- వేగూరు కాలువ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇందుకూరుపేట మండలం నాగరాజుతోపు గ్రామానికి చెందిన వినోద్ అనే యువకుడు బైక్‌పై ఇనమడుగు సెంటర్‌కు వెళ్తుండగా, ట్రక్కు, ఆటో ఒకేసారి ఢీకొంది. దీంతో అతని మోకాలి చిప్ప విరిగింది. స్థానికులు 108 వాహనంలో వినోద్‌ను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో నారాయణ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రిఫర్ చేసినట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రక్కు, ఆటో, బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న.